నిమజ్జనం కోసం భారీ బందోబస్తు

● హిల్స్‌లో రంగంలోకి 500 మంది అదనపు బలగాలు ● అడుగడుగునా నిఘా ● నిబంధనలు పాటించాలి: పోలీసులు



బంజారాహిల్స్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జై బోలో గణేశ్ మహారాజ్‌కీ జై.. గణపతి బొప్పా మోరీయా... అంటూ భక్తుల ఆధ్యాత్మిక నినాదాలు, యువత ఉత్సాహంతో కనులపండువగా జరిగే వినాయక నిమజ్జన వేడుకల్లో ఎటువంటి సంఘటనలు జరగకుండా, భక్తులు ఇబ్బంది పడకుండా పోలీసులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి తనిఖీలు చేపట్టారు. సమస్యాత్మక మైన ప్రాంతాల్లో ప్రత్యేకంగా పికెటింగ్‌లు పెట్టారు.

అదనపు బలగాలతో...

బంజారాహిల్స్ జూబ్లీహిల్స్ పరిధిలో వినాయక నిమజ్జన గస్తీ నిర్వహించేందుకు సుమారు 500 మంది అదనపు బలగాలు రంగంలోకి దిగారు. వివిద జిల్లాల బలగాలు హిల్స్‌కు చేరుకున్నాయి. డీఎస్పీ స్థాయి అధికారులతో పాటు నలుగురు సీఐలు. 50 మంది ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లను పోలీసులు సెక్టార్ల వారిగా విభాజించి బందోబస్తుకు పంపించారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, సెక్టార్ ఎస్‌ఐ నేతృత్వంలో వీరు పనిచేస్తారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనంగా బలగాలను దించారు.

పుషింగ్ పార్టీలు

రెండు డివిజన్ల పరిధిలో స్టేషన్ల పరిధిలో సుమారు మూడు వందలకు పైగా విగ్రహాలు మంగళవారం నిమజ్జనం కోసం హుస్సేన్ సాగర్‌కు తరలివెళ్లనున్నాయి. ఈ విగ్రహాలను క్రమపద్ధతిలో నిమ్మజ్జనానికి తరలించేలా పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఫిలింనగర్, వెంకటేశ్వరనగర్‌లో ఉన్న భారీ విగ్రహంతో పాటు సుమారు యాభై విగ్రహాల శోభాయాత్ర ఉదయం పదిలోపే మొదలయ్యేలా ఏర్పాట్లు చేశారు. స్టేషన్ పరిధిలో విగ్రహాల తరలింపు పూర్తయ్యాక బందోబస్తు సిబ్బంది ప్రధాన శోభాయాత్రలో విధులు నిర్వహించేందుకు వెళతారు.

నిబంధనలను పాటించాలి..

నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా ఉత్సవ కమిటీలకు పోలీసులు పలు సూచనలు జారీ చేశారు. జాగ్రత్తలు తీసుకుంటే మేలు జరుగుతుందని పోలీసులు చెబుతున్నారు.

- నిమజ్జనం కోసం తెచ్చిన వాహనాలు మంచి కండీషన్‌లో ఉండాలి
- డీసీపీ ఇచ్చిన సీరియల్ నంబర్‌ను వాహనానికి ముందు కనిపించే విధంగా అతికించాలి.
- లౌడ్ స్పీకర్లను వాహనానికి బిగించరాదు.
- వాహనాలలో కట్టెలు, ఆయుధాలు, మందుగుండు సామాగ్రి ఉంచరాదు.
- జెండాలను ఉపయోగించే కర్రలకు బదులుగా పీవీపీ పైపులను వాడితే మేలు. వీటి పొడవు రెండు అడుగులు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలి.
- ఊరేగింపు సమయంలో బాణాసంచా కాల్చరాదు.
- ఊరేగింపులో రంగులు చల్లకోవద్దు.
- అపరిచితులను వాహనంలో ఎక్కించుకోకపోవడం మేలు.
- ఊరేగింపులో పాల్గొనే ఉత్సవ సమితి నాయకుల జాబితా పోలీసులకు అప్పగించాలి.
- అనుమానాస్పదంగా ఎవరైన కనిపిస్తే వెంటనే సెక్టార్ ఎస్‌ఐకు సమాచారం అందించాలి.

నిర్వాహకులు సహకరించాలి



పోలీసులకు ఉత్సవ నిర్వాహకులు సహకరించాలి. నిబంధనలను పాటించాలి. ఎక్కడ ఎటువంటి సంఘటన చోటుచేసుకున్నా వెంటనే సంబంధిత సెక్టార్ ఎస్‌ఐకు సూచించాలి. లేదంటే 100కు ఫోన్ చేసినా సరిపోతుంది. విద్యుత్ వైర్లు అడ్డుగా ఉంటే ముందే ట్రాన్స్‌కో సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లాలి.

-సామల వెంకట్‌రెడ్డి, బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ

విగ్రహాలకు అదనపు బందోబస్తు



వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా ప్రతి మండపం వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేశాం. నిమజ్జనానికి తరలించే వ్యాన్‌తో పాటు ఓ పోలీసు కూడా సాగర్‌కు వెళ్లి నిర్వాహకులకు సహాయం అందిస్తారు. ట్రాఫిక్ ఆటంకం కలగకుండా శోభాయాత్ర నిర్వహించాలి. సామాన్య ప్రజలను ఇబ్బంది పెటొద్దు. చిన్న పిల్లలు నిమజ్జనం లారీ మీదకు ఎక్కించుకోకపోవడం మంచిది.

- వెంకటగిరి, జూబ్లీహిల్స్ డివిజన్ ఏసీపీ

పైప్‌లైన్ సామర్థ్యం పెంచాలి

● మాజీ ఉప రాష్ట్రపతికి నాట్కో ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం వినతి



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడుతో మాట్లాడుతున్న హెచ్‌ఎం గీత

బోరబండ, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): నాట్కో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు పెంచడానికి సహకరించాలని పాఠశాల బృందంతో కలసి ప్రధానోపాధ్యాయురాలు గీత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడికి వినతిపత్రం అందజేశారు. ఆదివారం పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించడానికి వచ్చిన ఆయనకు నాట్కో పాఠశాల బృందం బోర్‌వెల్ వేయించాలని, ఆట వస్తువులు కావాలని, ప్రహరీ ఎత్తు పెంచాలని, హైస్కూల్ విద్యార్థులు 1400 మంది, ప్రైమరీ విద్యార్థులు 600 మందికి ప్రస్తుతం ఉన్న వాటర్ పైపులైన్ 20 ఎంఎం సరిపోవడం లేదు. దీనికి బదులుగా 50 ఎంఎం పైపులైన్ నిర్మాణానికి కృషి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

22న జాతీయ స్థాయి కరాటే, కుంగ్ ఫూ, తైక్వాండో పోటీలు

పంజాగుట్ట, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): సింధు మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 22న యూసుఫ్ గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో మొదటి జాతీయ స్థాయి కరాటే, కుంగ్ ఫూ, తైక్వాండో పోటీలు జరుగనున్నాయి. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు సుమన్ తల్వార్, చీకోటి ప్రవీణ్, జబర్దస్త్ ఆర్టిస్ట్ వాసు, పోటీల చీఫ్ ఆర్గనైజర్ కె.సింధు తపస్విలతో కలిసి మొదటి జాతీయ స్థాయి కరాటే, కుంగ్ ఫూ, తైక్వాండో ఛాంపియన్ షిప్-2024 పోటీల ట్రోఫీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమను తాము రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సుమన్ తల్వార్ అన్నారు. కార్యక్రమంలో గ్లోబరిన వీసా సర్వీసెస్ చైర్మన్ ప్రభాకర్, షీ టీమ్స్ కోచ్ లక్ష్మి, సంపత్ కుమార్, అఖిల్ మహర్షి, కోచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.



గుజరాత్ ఎగ్జిబిషన్‌లో తెలంగాణ విద్యుత్‌స్టాల్స్

గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్‌లో మహాత్మామందిర్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో సోమవారం నుంచి మూడురోజుల పాటు 4వ గ్లోబల్ రీ ఎనవబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్ అండ్ ఎక్స్‌పో (రీ ఇన్వెస్ట్-2024)ను నిర్వహిస్తున్నారు. ఇందులో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆదివారం తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల చైర్మన్ ముషారఫ్ ఫరూకీ, వరుణ్ రెడ్డిలు పరిశీలించారు. సోమవారం ప్రధానమంత్రి అధ్యక్షతన ప్రారంభమయ్యే సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొంటున్నారు.

- (హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి)

అమీర్‌పేటలోని హోటల్ సితారలో మాట్లాడుతున్న అరకు ఎంపీ తనుజారాణి

విద్యార్థులకు మోటివేషన్ చేస్తా: ఎంపీ తనుజారాణి

అమీర్‌పేట, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మనదేశం నుంచి విదేశాలకు వెళ్లి చదువుతున్న విద్యార్థులకు మోటివేషన్ ఇవ్వడానికి నేనున్నానని అరకు ఎంపీ తనుజారాణి హామీ ఇచ్చారు. అమీర్‌పేటలోని హోటల్ సితారలో ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ మెడిసిన్, ఫ్రెషర్స్ మీట్ 2024-25ను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అరకు ఎంపీ తనుజారాణి, మాజీ జేడీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా తనుజారాణి మాట్లాడుతూ లక్ష్మీనారాయణతో కలిసి మాట్లాడటం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులను ప్రేరేపించడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. మాజీ జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ సంస్థకు చెందిన ప్రముఖులు, ముఖ్యంగా ఇరికిస్థాన్ సంస్థ గురించి ఎంపీ తనుజారాణి వివరించారని అందులో చదివి ప్రస్తుతం ఈ రోజు ఎంపీగా ఉండడం ఆనందంగా ఉందన్నారు. నేడు మెడికల్ ప్రొఫెషన్ ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఎలా మెడికల్ డిగ్రీని పూర్తి చేయాలో, తర్వాతా ప్రాక్టీస్ చేయడానికి అందుబాటులో ఉండే విషయాలను వివరించారు.

అధికారులూ.. ఈ సారైనా మారుస్తారా

● అర్ధరాత్రి వరకు నిమజ్జన ఊరేగింపుతో పరేషాన్

● ప్రతీయేడు అంధకారంలో పలు కాలనీలు

కార్వాన్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): అధికారుల సమన్వయలోపం వల్ల గణేశ్ నిమజ్జనం రోజు షేక్‌పేట డివిజన్‌లోని పలు కాలనీలు అంధకారంలో మగ్గుతున్నాయి. బంజారాహిల్స్ ఏసీపీ డివిజన్, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని షేక్‌పేట డివిజన్‌లో రాత్రి తొమ్మిది నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు ఊరేగింపులు నిర్వహిస్తారు. దీంతో అనేక సమస్యలు వస్తున్నాయి. గతేడాది ఈ విషయంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈసారైనా అధికారులు చొరవ తీసుకుని నిమజ్జన ర్యాలీ ఉదయం నుంచి సాయంత్రంలోపు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు. లేకుంటే ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ కనెక్షన్ నిలిపివేయకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డుపై బైఠాయించిన బీఆర్‌ఎస్వీ నాయకులు

పేదలకు వైద్య విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వం

● మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడికి యత్నించిన బీఆర్‌ఎస్వీ

బంజారాహిల్స్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేయాలని ప్రయత్నిస్తున్నారని బీఆర్‌ఎస్వీ నాయకులు ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యలో స్థానికత నిర్ణయించటానికి జీవో నంబర్ 33 ని ఉపసంహరించి కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేస్తు బీఆర్‌ఎస్వీ నాయకులు ఆదివారం బంజారాహిల్స్ మినిస్టర్స్ క్వార్టర్స్ ముట్టడికి పిలుపునిచ్చింది. ఈ మేరకు తెలంగాణ భవన్ నుంచి క్వార్టర్స్‌కు బయలు దేరుతుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో నాయకులు రోడ్డుపై బైఠాయించడంతో బంజారాహిల్స్ పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించటంతో ప్రైవేట్ మెడికల్ కాలేజీలు డీమ్డ్ యూనివర్సిటీ హోదాకు దరఖాస్తు చేసుకోవటం వల్ల 50% కన్వీనర్ కోట సీట్లు రాష్ట్ర విద్యార్థులు నష్టపోతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం జీవో 33ని వెనక్కి తీసుకోని సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైద్య విద్య విషయంలో పేదలకు అన్యాయం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు.



మోక్షగుండం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పవర్ ఇంజనీర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు రత్నాకర్‌రావు, సభ్యులు

దేశ, రాష్ట్రాభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకం

● రాష్ట్ర పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్‌రావు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): దేశ, రాష్ట్రాలభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్‌రావు అన్నారు. స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే వేడుకలను ఆదివారం సోమాజిగూడ విద్యుత్ ఇంజనీర్స్ భవన్‌లో నిర్వహించారు. ఇంజనీర్స్ భవన్ ఆవరణలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి అసోసియేషన్ కార్యదర్శి సదానందం, శివశంకర్‌లు పూలమాళలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఇంజనీర్లందరూ సంస్థ పురోగతిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు, వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్కల ఆదేశాలతో విద్యుత్‌రంగంలో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో నిలిపేందుకు ఇంజనీర్లు పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోషియేషన్ నేతలు పివిరావు, సురేష్, భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, గోపాలరావు, శ్యాం సుందర్‌రెడ్డి, నందకుమార్‌లు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ఓబీసీ విద్యార్థుల సత్యాగ్రహ దీక్ష

● దీక్షను విరమింపజేసిన రాజారామ్ యాదవ్



విద్యార్థుల దీక్షను విరమింపజేస్తున్న బీసీ జనసభ అధ్యక్షుడు రాజారామ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన చేయడం, ఓబీసీ రిజర్వేషన్లు ఎత్తివేయాలన్న డిమాండ్‌తో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థులు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఆలిండియా ఓబీసీ స్టూడెంట్ అసోసియేషన అధ్యక్షుడు శివ ముదిరాజ్, వసుమతి యాదవ్‌ల ఆధ్వర్యంలో హెచ్‌సీయూలో దీక్ష జరిగింది. కులగణన చేపట్టి, దాని ఆధారంగా రానున్న పార్లమెంట్ సమావేశాల్లో విద్య ఉద్యోగ, చట్టసభల్లో ఓబీసీలకు 50 శాతం కేటాయించేలా బిల్లు పెట్టాలని దీక్షలో పాల్గొన్న బీసీ విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ జనసభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ విద్యార్థులకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు.



సాయిబాబానగర్ బస్తీల్లో గణపతి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్



ఫిలింనగర్ దైవ సన్నిధానంలో లడ్డూను దక్కించుకున్న నిర్మాత సురేష్‌కొండేటి



వెంకటగిరి వెల్‌ఫేర్ అసోసియేషన్ మండపం వద్ద అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి

గం.. గం గణేశా!

ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో గణేశ్ నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. అపార్ట్‌మెంట్లు, కాలనీలు, బస్తీలలో ఏర్పాటు చేసిన మండపాల్లోని వినాయక విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మండపాలను పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. -ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్ బృందం



మధురానగర్ బి-బ్లాక్ లో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



సూర్య భక్త సమాజ్ మండలి వినాయక మండపంలో నీలిమ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు



ఎర్రగడ్డ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో వన్‌రాజ్ రెడ్డిని సన్మానిస్తున్న దేవాలయ కమిటీ అధ్యక్షులు గూడూరి చెన్నారెడ్డి, విజయలక్ష్మి



వెంగళరావునగర్ యూత్ అసోసియేషన్ మండపంలో డాక్టర్ పీపీ రవి శేఖర్ రెడ్డి



అమీర్‌పేట నీలగిరి బ్లాక్ గణేశ్ ఉత్సవ కమిటీ వినాయక మండపంలో వేలం పాటలో రూ. 1.10 లక్షలకు లడ్డూను దక్కించుకున్న జీకే కంపూటర్స్ అధినేత గంట నర్సింహరావు

← - అమీర్‌పేట, ఆంధ్రజ్యోతి

రాజీవ్ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ మండపం వద్ద పూర్ణాహుతి సమర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్





మధురానగర్ డి-బ్లాక్‌లో ప్రతాప్ రెడ్డి, వెంకటేశ్వరరావు తదితరులు



సాయిబాబానగర్ బస్తీలో అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

పరిశోధకులు చరిత్రను వెలికితీయాలి

● అలగప్ప యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొ. రాజేంద్రన్
● ఇంటర్ నుంచే విద్యార్థులకు చరిత్రను బోధించాలి
● వచ్చే సంవత్సంలో శ్రీలంకలో పుదుచ్చేరి వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ నిర్వహణ
● అంబేడ్కర్ వర్సిటీలో ముగిసిన వార్షిక సమావేశం



పుదుచ్చేరి వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ ముగింపు సమావేశంలో ప్రొ.రాజేంద్రన్‌కు పుస్తకాన్ని అందచేస్తున్న ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొ.సుధారాణి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు ఆయా రాష్ట్రాలు, ప్రాంతాల వారీగా ఉన్న చరిత్రను వెలికితీయాలని, అసంబద్ధంగా ఉన్న చరిత్రను భవిష్యత్ తరాలపై రుద్దాల్సిన అవసరం లేదని అలగప్ప యూనివర్సిటీలో మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొ.ఎస్.రాజేంద్రన్ పిలుపునిచ్చారు. జూబ్లీహిల్స్‌లోని డా. బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం చరిత్ర విభాగం, పుదుచ్చేరి వరల్డ్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రెండు రోజుల వార్షిక సమావేశ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రొ.ఎస్.రాజేంద్రన్ మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ విద్యాభ్యాసం నుంచే దేశ, ప్రాంతీయ చరిత్రను ఒక అంశంగా బోధించాలని సూచించారు. ఈ దిశగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించనున్నట్లు వెల్లడించారు. ప్రపంచ చరిత్ర కాంగ్రెస్ ప్రాంతీయ కార్యదర్శి, విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొ.ఇ.సుధారాణి మాట్లాడుతూ రెండు రోజుల సదస్సులో దేశవ్యాప్తంగా వచ్చిన యువ పరిశోధకులు, అధ్యాపకులు సమర్పించిన పరిశోధనా పత్రాలు సమాజ హితం కోరేలా ఉన్నాయని ఇది ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. శ్రీలంక, పెరడెనియా విశ్వవిద్యాలయ ప్రొ.రోహిత్ దసనాయకా మాట్లాడుతూ శ్రీలంకలో దక్షిణ భారతదేశ చరిత్రను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టినట్లు భారత దేశ చరిత్రకు ప్రపంచ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందని వెల్లడించారు. వచ్చే సంవత్సరం పుదుచ్చేరి వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్‌ను శ్రీలంకలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పుదుచ్చేరి వరల్డ్ హిస్టరీ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డా. సందీప్ కె.దాసరి రెండు రోజుల వార్షిక సమావేశ నివేదికను సభలో సమర్పించారు. కార్యక్రమంలో ఇతర విశ్వవిద్యాలయాల చరిత్ర విభాగాల ఆచార్యులు, డీన్‌లు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

కురుమలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



బీరప్ప, కురుమల చరిత్ర పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కురుమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముత్త సంతోష్ కురుమ తదితరులు

పంజాగుట్ట, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): సంచార జాతులకు చెందిన కురుమ సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చడానికి అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపాలని, కురుమ కార్పొరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘాల జేఏసీ చైర్మన్, కురుమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముత్త సంతోష్ కురుమ అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు రమేష్ కురుమ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్ బి.నాగోశేషు రాసిన బీరప్ప, కొమ్మ కైలాష్ రాసిన కురుమ కుల చరిత్ర పుస్తకాలను కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, పృథ్వీరాజ్ యాదవ్, జేఏసీ నాయకులు రవి కుమార్, ఎగ్గె మహేందర్, శ్యామ్ కురుమ, బెల్లం మాధవిలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కురుమ సంఘాల నాయకులు వంశీ కురుమ, పాండు, న్యాయవాది నర్రి స్వామి,డి.శ్రీనివాస్, తెలంగాణ ఒగ్గు బీర్ల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధర్మయ్య ఒగ్గు, మాదారం కృష్ణ, కురువ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.



సూపర్ మార్కెట్‌లోకి దూసుకుపోయిన కారు, ధ్వంసమైన ద్విచక్ర వాహనాలు

మద్యం మత్తులో కారు డ్రైవింగ్

● సూపర్ మార్కెట్‌లోకి దూసుకుపోయిన కారు
● మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసం

అమీర్‌పేట, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కారు నడిపిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బీభత్సం సృష్టించిన సంఘటన ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఆదివారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వెంగళరావునగర్‌కు చెందిన రవి(45) సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మద్యం తాగి టాటా పంచ్ కారును నడుపుకుంటూ ఉమేష్ చంద్ర విగ్రహం వైపు నుంచి ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపంలో యూటర్న్ వేగంగా తీసుకోవడంతో అదుపు తప్పిన కారు అక్కడ ఉన్న ఓ సూపర్ మార్కెట్‌లోకి దూసుకుపోయింది. దీంతో సూపర్ మార్కెట్ ముందు ఉన్న మూడు ద్విచక్ర వాహనాలు ధ్వంసం అయ్యాయి. కారు దూసుకవస్తుండడంతో అక్కడ ఉన్నవారు ప్రాణభయంతో పరుగులు తీసారు. వెంటనే అక్కడికి చేరుకున్న ట్రాఫిక్ పోలీసులు కారు నడిపిన రవిని అదుపులోకి తీసుకుని బ్రీత్ ఎనలైజర్ పరీక్ష నిర్వహించగా అందులో అతనికి 550 పాయింట్లు వచ్చింది. వెంటనే రవిని పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసిన ఎస్ఆర్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పరమేశ్వరరాజు తదితరులు

కాలిగ్రఫీ పుస్తకావిష్కరణ

అమీర్‌పేట, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత కాలిగ్రఫర్, కళాకారుడు పూసపాటి పరమేశ్వరరాజు తన కాలిగ్రఫీ పుస్తకాన్ని ఆదివారం అమీర్‌పేటలోని మేరీగోల్డ్ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో భారతీయ పురణాలకు సంబంధిచిన అంశాలను పొందుపర్చారు. భారతీయ సంస్కృతికి వెన్నముకగా ఉండే కథలు సైతం ఇందులో ఉన్నాయి. పరమేశ్వరరాజు కాలిగ్రాఫీ పుస్తకం కళారంగంలో ఒక ముఖ్య ఘట్టాన్ని సూచిస్తుందని వక్తలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాలిగ్రఫీ కళాకారులు నవకాంత్ కరిదే, ఇతర రచయితలు, చిత్రకారులు పాల్గొన్నారు.

ఇండియన్ రేసింగ్ చాంప్ అఖిల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో భాగంగా జరుగుతున్న ఫార్ములా-4 చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ రేసర్ అఖిల్ నాలుగో రేసులో విజేతగా నిలిచి ట్రోఫీ సాధించాడు. చెన్నైలోని మద్రాస్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో జరిగిన ఈ రేసును అఖిల్ 27 నిమిషాల 31.329 సెకన్లలో పూర్తి చేసి, విజేతగా నిలిచాడు. అహ్మదాబాద్ అపెక్స్ జట్టు రేసర్ డీవీ నందన్ ద్వితీయ, బెంగాల్ టైగర్స్ జట్టు రేసర్ రుహాన్ తృతీయ స్థానం దక్కించుకున్నారు.

బర్మాటేకు ఉడెన్ ప్యానెల్ పరిశీలన



సికింద్రాబాద్ బోయిన్‌పల్లి టింబర్ డిపోలో బర్మాటేకుతో తయారు చేసిన ఎస్టేట్ ఉడెన్ ప్యానెల్‌ను ఈనెల 10న ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ముకు చూపించానని టింబర్ డిపో అధినేత చదలవాడ శరత్ తెలిపారు. ఆదివారం నగరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాబలిపురానికి చెందిన ఆరుగురు కళాకారులతో ప్యానెల్‌ను తయారు చేశారని, గతంలో అయోధ్య రామాలయానికి ప్రధాన ద్వారాలను అనంత పద్మనాభస్వామి విగ్రహాన్ని తయారు చేశామని రాష్ట్రపతికి వివరించినట్టు తెలిపారు. తమ సంస్థకు చెందిన ఉడెన్ ప్యానెల్‌లను ఆలయాలకు అమర్చడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు.

బోయిన్‌పల్లి, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి)



వార్షికోత్సవంలో ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి, యూనియన్ నేతలు, ఉద్యోగులు

గాంధీలో 'ఎయిడ్స్ కంట్రోల్' యూనియన్ వార్షికోత్సవం

అడ్డగుట్ట, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగుల యూనియన్ 15వ వార్షికోత్సవ ఉత్సవాలు ఆదివారం సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ఆవరణలోని గాంధీ అలుమ్ని భవనంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి పాల్గొని మాట్లాడారు. ఎయిడ్స్ నియంత్రణలో 20ఏళ్లపాటు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసిన 67 మంది రెగ్యూలరైజ్ కావడానికి ఐఎన్‌టీయూసీ నిరంతరం పోరాడిందన్నారు. త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరుతామని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్ సుజిత్, తెలంగాణ వేతనాల బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు సత్యదీప్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, ఎయిడ్స్ కంట్రోల్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, భాస్కర్‌రెడ్డి, ప్రకాశ్‌గౌడ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు

మూఢనమ్మకాలు జనజీవనానికి ప్రమాదం

ఏఎస్‌రావునగర్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మూఢ నమ్మకాలు జనజీవనానికి ప్రమాదకరమని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కే నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక లాంటి సంస్థలు మూఢ నమ్మకాలపై పోరాడాల్సిన అవసముందని ఆయన అన్నారు. రెండు రోజులుగా ఏఎస్‌రావు నగర్ అణుపురం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన జనవిజ్ఞానవేదిక 5వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ కే నాగేశ్వర్‌రావు, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేషం పాల్గొన్నారు. నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ విజ్ఞానం నిరంతరం వాస్తవాన్ని నేర్పుతుందని, కాలక్రమేణా కొన్ని నమ్మకాలు సన్నగిల్లుతాయని అన్నారు. మతం, సైన్స్ మధ్య యుద్ధం సృష్టించవద్దన్న ఆయన, ప్రజల విశ్వాసాన్ని గౌరవిస్తూనే శాస్త్రీయ విజ్ఞాన విశ్వాసాలను పెంపొందించాలని సూచించారు. శాస్త్రీయ విద్యా విధానం ప్రజలకు దూరం చేస్తున్న పాలకుల ధోరణులపై పోరాటం చేయాలన్నారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేషం మాట్లాడుతూ సమాజంలో సైన్స్ టెంపర్ లేకపోతే మూఢ, అంధ విశ్వాసాలు పెంపొందుతాయని అన్నారు. మనిషి తన విజ్ఞానాన్ని అర్థం చేసుకుని ముందుకు వెళ్లాలి అన్నారు. సైంటిఫిక్ బేసిస్‌లో పెరుగుతున్న అకృత్యాలను ప్రశ్నించాలన్నారు. జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమ సంస్థ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరచడంతో పాటు వ్యవసాయం, విజ్ఞానం, పర్యావరణం వంటి సమస్యలపై పోరాటం చేస్తుందని తెలిపారు. ముగింపు సమావేశంలో పలు తీర్మాణాలను ప్రవేశపెట్టారు. అనంతరం జనవిజ్ఞానవేదిక తెలంగాణ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చెలిమెల రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా ప్రొఫెసర్ కే.లక్ష్మారెడ్డి, బీఎస్‌రెడ్డి, అలవాల నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా రాజా, కార్యదర్శులుగా రవిందర్‌రెడ్డి, గంగరాజు, వెంకటరమణారెడ్డి, మహేంద్రం, శ్రీనివాసరావు, వెంకటరమణ, కోశాధికారిగా నాగరాజు, మరో 11 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.



సికింద్రాబాద్ గణేశ్ ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్



వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న కీర్తి హర్షకిరణ్, మేకల సారంగపాణి తదితరులు



మహేంద్రహిల్స్‌లో గణేశుడికి పూజలు చేస్తున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రామకృష్ణ దంపతులు

భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు

- సికింద్రాబాద్ గణేశుడి ఆలయంలో పూజలు చేసిన ఎంపీ ఈటల
- పలుచోట్ల అన్నదానాలు, లడ్డూ వేలం

సికింద్రాబాద్/మారేడుపల్లి/ రెజిమెంటల్ బజార్/బౌద్ధనగర్/తిరుమలగిరి/అమీర్‌పేట/తార్నాక/చిలకలగూడ (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్ నగర్ నియోజక వర్గాలలో నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకొంటున్నారు. తొమ్మిదో ఆయా నియోజకవర్గాల పరిధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద పలువురు ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, మండప నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు చేశారు. గణేశుడి లడ్డూకు వేలం పాట నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సికింద్రాబాద్ గణేశ్ టెంపుల్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కంటోన్మెంట్ బోర్డు 5వ వార్డు త్రిమూర్తి కాలనీలో ఏర్పాటు చేసిన మండపం వద్ద అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ మధురానగర్ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో మేకల కీర్తి హర్షకిరణ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన మట్టి వినాయకుడికి ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఊరేగింపుగా గణేశుడి విగ్రహాన్ని తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ బీజేపీ ఇన్‌చార్జి మేకల సారంగపాణి పాల్గొన్నారు. మహేంద్రహిల్స్ కాలనీలోని వినాయక మండపంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్, కంటోన్మెంట్ బోర్డు నామినేట్ సభ్యుడు జే రామకృష్ణ దంపతులు పూజలు చేశారు.

ఇంద్రనగర్ కాలనీలో నేతాజీ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. రవి ప్రసాద్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. తిరుమలగిరి పెద్ద కమేళాలో నల్లపోచమ్మ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపములో స్థానిక మహిళా భక్తులు పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రుక్మయ్య ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. తార్నాకలోని లేబర్ అడ్డా వద్ద ఆటో స్టాండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకమండపం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లికంటి వీరన్న దంపతులు ముఖ్య అతిధులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మణికంఠ, చరణ్, మురళీ, అసోసియేషన్ సభ్యులు మల్లయ్య, రాజు, వెంకన్న, కనకరాజు, శ్రీనివాస్, విజయ్, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అమీర్‌పేట నీలగిరి బ్లాక్ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద ఆదివారం గణశుడి లడ్డూకు వేల ం పాట నిర్వహించారు. జేకే కంప్యూటర్స్ అధినేత గంట నర్సింహారావు రూ. 1.10 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. కౌశిక్‌రామ సాయి అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడికి నిర్వాహకుడు శంకర్‌రావు కుటంబ సభ్యులు పూజలు చేశారు.



త్రిమూర్తి కాలనీలో అన్నదానం చేస్తున్న సర్వే సత్యనారాయణ



వెస్ట్ మారేడుపల్లిలో గణనాథుడిని దర్శించుకున్న కార్పొరేటర్ కొంతం దీపిక



ఇంద్రనగర్ కాలనీలో గణేశుడికి పూజలు చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. రవిప్రసాద్‌గౌడ్ తదితరులు



తిరుమలగిరి పెద్ద కమేళాలోనిగణేశ్ మండపములో పూజలు చేస్తున్న మహిళలు



మెట్టుగూడలో వినాయకుడి మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ రాసూరి సునీత



మండపంలో వినాయకుడికి పూజలు చేస్తున్న నిర్వాహకుడు శంకర్‌రావు కుటంబ సభ్యులు



తార్నాక ఆటో స్టాండ్ వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు



వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న జేకే కంప్యూటర్స్ అధినేత గంట నర్సింహారావు

ఘనంగా జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

రవీంద్రభారతి, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కళా ప్రదర్శనలు ప్రేక్షకుల్ని రంజింపజేశాయి. ఆదివారం రవీంద్రభారతిలో జై జవాన్, జై కిసాన్, జై కళాకార్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. ఇందులో భాగంగా నాట్యగురువులకు సత్కారం చేసి, కళారత్న పురస్కారాలను ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా పురస్కారగ్రహీతలను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని నాట్యగురువులను సత్కరించుకోవడం ఆనందకరమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా కళలను, కళాకారులను ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. లయన్ రమణారావు, నాగుల సత్యంగౌడ్, మర్క అనిల్‌గౌడ్, ఏలేశ్వరపు చలపతిశాస్త్రి, తదితరులు కళాకారులను సత్కరించి అభినందించారు.



నాట్యగురువులను సత్కరిస్తున్న అతిథులు



పుస్తకావిష్కరణ

అమీర్‌పేట, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత కాలిగ్రఫీ కళాకారుడు పూసపాటి పరమేశ్వరరాజు తన కాలిగ్రాఫీ పుస్తకాన్ని ఆదివారం అమీర్‌పేటలోని మేరీగోల్డ్ హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ పుస్తకంలో భారతీయ పురణాలకు సంబంధిచిన అంశాలను పొందుపర్చారు. భారతీయ సంస్కృతికి వెన్నముకగా ఉండే కథలు ఇందులో ఉన్నాయి. పరమేశ్వరరాజు కాలిగ్రాఫీ పుస్తకం కళారంగంలో ఒక ముఖ్య ఘట్టాన్ని సూచిస్తుందని వక్తలు వెల్లడించారు. కార్యక్రమంలో కాలిగ్రాఫీ కళాకారులు నవకాంత్ కరిదే, ఇతర రచయితలు, చిత్రకారులు పాల్గొన్నారు.

రైలులో గుండెపోటుతో విశ్రాంత ఉద్యోగి మృతి

బర్కత్‌పుర, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): రైలులో విశ్రాంత ఉద్యోగి గుండెపోటుతో మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రం జబల్‌పూర్‌కు చెందిన దేవేంద్రకుమార్ పరోవర్(70) విశ్రాంత ఉద్యోగి. జబల్‌పూర్- యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బెంగళూరు వెళ్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో గుండెపోటు వచ్చింది. రైలు స్టేషన్‌లో ఆగేసరికి మృతిచెందాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. రాజేంద్రనగర్ సర్కిల్ పీడీపీ చౌరస్తా నుంచి ఆరాంఘర్ చౌరస్తాకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకుడిని పిల్లర్ నంబర్ 266 వద్దకు రాగానే బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న మోసిన్ అక్కడికక్కడే మృతిచెందగా, వెనకాల కూర్చున్న మరో యువకుడికి గాయాలయ్యాయి. అత్తాపూర్ పోలీసులు బొలెరోను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఆల్ ఇండియా థాల్'లో ఎన్‌సీసీ కెడెట్స్ ప్రతిభ

- మొదటి స్థానంలో బాలికలు, నాల్గో స్థానంలో బాలురు
- సత్కరించిన ఎయిర్ కమోడోర్ మధుసూదన్‌రెడ్డి

అల్వాల్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): ఆల్‌ఇండియా థాల్ సైనిక్ క్యాంపులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ కెడెట్స్‌ను సికింద్రాబాద్‌లోని డైరెక్టరేట్ కార్యాలయంలో ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమోడోర్ వి.మధుసూదన్‌రెడ్డి సత్కరించారు. ఈ నెల 2వ తేదీ నుంచి 13వ తేదీ వరకు న్యూఢిల్లీలోని డీజీ ఎన్‌సీసీ కారియప్ప పరేడ్ గ్రౌండ్‌లో ఎన్‌సీసీ క్యాంపును నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డైరెక్టరేట్ నుంచి 91 మంది ఎన్‌సీసీ కెడెట్స్ పాల్గొన్నారు. 2 ఆల్ ఇండియా కాంటిజెంట్ ట్రోఫీలను, 10 బంగారు పతకాలు, 9 వెండి, 9 కాంస్య పతకాలను సాధించారు. ఆల్‌ఇండియా థాల్ సైనిక్ క్యాంప్‌లో బాలికలు మొదటి స్థానం, బాలురు 4వ స్థానంలో నిలిచారు. దేశంలోని 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్‌లలో ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ ఓవరాల్‌గా రెండోస్థానంలో నిలిచింది. ఆరోగ్యం, పరిశుభ్రత, మ్యాప్ రీడింగ్ విభాగంలో బాలికలు, బాలుర జట్టు మొదటి స్థానాలను కైవసం చేసుకున్నారు. కెడెట్ హన్షిత వ్యక్తిగత విభాగంలో బంగారు పతకాన్ని, కెడెట్ సాయిచంద్ సీనియర్ డివిజన్ నుంచి కాంస్య పతకాన్ని సాధించారు. ఆదివారం నగరానికి వచ్చిన కెడెట్స్‌ను కమోడోర్ మధుసూదన్‌రెడ్డి సత్కరించారు. క్యాంప్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరితో ఆయన ప్రత్యేకంగా మాట్లాడి అభినందించారు.



కేవీ బేగంపేట జట్టు

బాస్కెట్‌బాల్ రన్నరప్‌గా కేవీ బేగంపేట జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): కేంద్రీయ విద్యాలయ జాతీయ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ కేవీ ఏఎఫ్ఎస్ బేగంపేట జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం కాన్పూర్ కేవీ ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన ఫైనల్లో హైదరాబాద్ జట్టు 49-58తో జైపూర్ టీమ్ చేతిలో పోరాడి ఓడింది. అంతకుముందు జరిగిన సెమీస్‌లో హైదరాబాద్ టీమ్ 57-52తో గురుగావ్ జట్టుపై నెగ్గింది. కేవీ హైదరాబాద్ ప్రాంత డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు కేవీ బేగంపేట బాస్కెట్‌బాల్ క్రీడాకారులను అభినందించారు.

మా ఇళ్లు కూల్చారు సరే! 'డబుల్' ఇళ్లెప్పుడిస్తారు?

బన్సీలాల్‌పేట డివిజన్ వాసుల ఆవేదన



నిర్మాణానికి ముందు పాత ఇంటివద్ద లబ్ధిదారులు

పద్మారావునగర్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి ఇస్తామని చెప్పి ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు మా ఇళ్లను కూల్చివేశారని, ఇప్పటి వరకు డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించకపోవటంతో ఎవరిని సంప్రదించాలో తెలియక చాచా నెహ్రూనగర్, పార్సిగుట్ట ప్రహరీ ప్రాంత నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి చాచా నెహ్రూనగర్ పార్సిగుట్ట ప్రహరీ ప్రాంత నివాసితులు కొందరు కొన్నేళ్లుగా తమకు డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయించాలని తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరిగి, అధికారులకు మొర పెట్టుకొన్నా ఎలాంటి ఫలితం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు సైతం వినతిపత్రం అందించామని తెలిపారు.

ఎన్నో ఏళ్లుగా పార్సిగుట్ట ప్రహరీ ప్రాంతంలో స్థిరనివాసం ఏర్పరచుకొని కుటుంబంతో కలిసి నివసిస్తున్న తమకు ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి ఇస్తామని నమ్మకం కల్పించడంతో ఇళ్లను ఖాళీ చేశామని తెలిపారు. ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రత్యేక చొరవ చూపి ఇళ్లు లభించని వారికి తగిన న్యాయం చేయాలని కోరారు.



పార్సిగుట్ట ప్రహరీ వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం (క్యూ బ్లాక్) ఇళ్ల నిర్మాణం

డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక కోసం పలు మార్లు రెవెన్యూ అధికారులు నివాసితుల నుంచి ధ్రువపత్రాలు సేకరించి, సర్వే నిర్వహించి 27-09-2017న విడుదల చేసిన ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు ఉన్నప్పటికీ ఇప్పటి వరకు తమకు ఇళ్లను ఎందుకు కేటాయించలేదో అర్థం కావడంలేదని ఆశావహులు తెలిపారు. పార్సిగుట్ట ప్రహరీ వద్ద నిర్మించిన డబుల్ బెడ్రూం (క్యూ బ్లాక్) నిర్మాణంలో 12 ఇళ్లు ఉన్నప్పటికీ అందులో 6 స్థానికులకు కేటాయించి, మిగతా 6 ఇతరులకు కేటాయిండంతో మాకు ఇళ్లు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు సరైన విచారణ చేపట్టి అర్హత కలిగిన వారికి ఇళ్లను కేటాయించటానికి తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

మాకు ఇల్లు ఇవ్వాలి



ఎన్నో ఏళ్లుగా మేం ఉంటున్న ఇంటిని కూల్చివేశారు. ఇంతవరకు ఇల్లు కేటాయించలేదు. ఎవరిని అడగాలో తెలియడంలేదు. సీఎం క్యాంపు కార్యాలయంలోని ప్రజావేదికలో కూడా దరఖాస్తు ఇచ్చాము. అద్దె చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నాము. తర్వగా విచారణ చేసి ఇల్లు కేటాయించాలి.


- కె. శ్రీలక్ష్మి, సీసీనగర్, బన్సీలాల్‌పేట్

జాబితాలో పేరు ఉన్నా ఇల్లు ఇవ్వలేదు



డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు జాబితాలో పేర్లు ఉన్నా మాకు ఇంటిని కేటాయించలేదు. అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం. ఏం చేయాలో తెలియడంలేదు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా సరైన విచారణ చేసి మాకు ఇళ్లను కేటాయించాలి.

- ఏ.లలిత, సీసీనగర్, బన్సీలాల్‌పేట్



లష్కర్ జిల్లా ఏర్పాటుకు తన మద్దతు ఉంటుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ పరేడ్ మైదానం వద్ద మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసి వారిలో సమితి ప్రధాన కార్యదర్శి బాలరాజు యాదవ్, శైలేందర్, బాబురావు, కృష్ణముదిరాజ్, శ్రీకాంత్‌రెడ్డి, అజీజ్, అశోక్ చారి, హరిచారి, సునిల్ ముదిరాజ్‌లు ఉన్నారు.

- సికింద్రాబాద్ - ఆంధ్రజ్యోతి